సాక్షి
సంగారెడ్డి
గురువారం ౹ 28 ౹ సెప్టెంబర్ ౹ 2023



సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బొల్లారం



తేదీ: 29-09-2023
సమయం: శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు
అంశం: బొల్లారం మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమలు, వ్యాధుల తీవ్రత తదితర అంశాలు.
ఫోన్ నంబర్లు:
94400 19940, 99669 95074

తిరుపతి, మున్సిపల్ కమిషనర్, జోగిపేట



తేదీ : 29-09-23
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
అంశం: పారిశుద్ధ్య సమస్య-పరిష్కారం
ఫోన్ నంబర్ :
96767 58262

తూప్రాన్ మీదుగా రైలు

- అభివృద్ధికి కేరాఫ్ గజ్వేల్
- ప్రతి పథకంలో కేసీఆర్ కనిపిస్తారు
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

తూప్రాన్: అన్నిరంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. గజ్వేల్ నియోజకవర్గ ప్రతిష్ట మరింత ఇనుమడించేలా చర్యలు చేపడుతున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఇందులో భాగంగా తూప్రాన్ మీదుగా వేములవాడకు రైలు కలను సాకారం చేయనున్నారని వెల్లడించారు. బుధవారం తూప్రాన్‌లో రూ.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాడు బస్సుల కోసం ప్రజలు అల్లాడిపోయారని, ప్రస్తుతం రైలు పరుగులు పెడుతూ మెదక్, సిద్దిపేట ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా పరిశ్రమల స్థాపనతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతోందని చెప్పారు. మంచినీళ్ల కోసం ఆడపడచులు పడిన కష్టాలు ఇప్పటికీ మర్చిపోలేమని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్కరికి కేసీఆర్ కనిపిస్తాడన్నారు. ప్రభుత్వంపై విపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, అందుకే ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కరోనా లాంటి మహమ్మారి వచ్చినా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆపని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.



పొగమంచు కప్పేసింది

జహీరాబాద్ పట్టణాన్ని పొగమంచు కప్పేసింది. బుధవారం ఉదయం 7 గంటల తర్వాత కూడా సూర్యుడు కానరాలేదు. మరో వైపు చెట్లు, ఇళ్లను మంచు దుప్పటిలా కమ్మేసింది. దీనికి తోడు రోడ్డు సరిగా కనిపించక వాహనచోదకులు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది. అయితే ప్రకృతి ప్రేమికులు మాత్రం ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. జహీరాబాద్ టౌన్

కోరలు చాచిన కాలుష్యం

- పాశమైలారం పారిశ్రామిక వాడ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు
- యథేచ్ఛగా పర్యావరణంలోకి..
- రాత్రిళ్లు మరింత ఉధృతం
- ఇబ్బందుల్లో రుద్రారం, చిట్కుల్, ఇస్నాపూర్ ఇతర గ్రామాలు

పటాన్‌చెరు: పటాన్‌చెరు ప్రాంతంలో జల, వాయు కాలుష్యం మరోసారి విజృంభిస్తోంది. తెలంగాణ రాకముందు కాలుష్యం తీవ్రంగా ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కొన్నేళ్ల పాటు సమస్య తీవ్రత తగ్గినట్టు కనిపించింది. కానీ తాజాగా తీవ్ర రూపం దాలుస్తోంది. పటాన్‌చెరు మండలపరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడ నుంచి జల, వాయు కాలుష్యాల కారకాల మూలంగా మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మూడు వేల ఎకరాల్లో 297 పరిశ్రమలు ఉన్నాయి. అందులో బల్క్ డ్రగ్ పరిశ్రమలు అధికం. ఈ ప్రాంతం నుంచే వివిధ రాష్ట్రాలకు ట్యాంకర్ల ద్వారా రసాయనాలను సరఫరా చేస్తున్నాయి. వాటి నుంచి వెలువడే పొగ పర్యావరణంలోకి యథేచ్ఛగా కలుస్తున్నది. కొన్ని ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా పైప్ లైన్లు వేస్తుండటం రోడ్లపైకి కలుషిత వ్యర్థాలను వదిలేయడం చేస్తున్నాయి. అందుకు ఇస్నాపూర్ పెద్ద చెరువులోకి కలుషిత నీటిని వదులుతుండటం తార్కాణం. పారిశ్రామిక వాడ ఏర్పాటైన నుంచే ఈ సమస్య అలానే కొనసాగుతూ వస్తోందని తెలుస్తోంది. ఇప్పుడు ఆ రాక్షస క్రీడకు అంతేలేకుండా పోతోంది. పరిశ్రమల యజమాన్యాలు చెరువుల్లోకి శుద్ధి జలాలు విడుదల చేస్తామని, అవసరమైన కామన్ ఎఫ్లుయేంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)ను ఏర్పాటు చేస్తామని చెప్పాయి. ఆచరణలో మాత్రం ఇంకా నిర్మాణం దశలో ఉంది. దీంతో గాలి కాలుష్యానికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు పారిశ్రామికవేత్తలతో మిలాఖత్ అయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాశమైలారం నుంచి విడుదలవుతున్న పొగ మూలంగా రుద్రారం, గణేష్ గడ్డ, చిట్కుల్, ముత్తంగి, నందిగామ, భానూరు గ్రామాల్లోని ప్రజలు సతమతమవుతున్నారు. రాత్రి పూట దాని తీవ్రత ఎక్కువగా ఉంటుందని వారు వాపోతున్నారు. దీనిని నియంత్రించాల్సిన గస్తీ అధికారులు కనీసం ఫోన్లలో కూడా అందుబాటులో ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇస్నాపూర్ పెద చెరువులోకి భారీ లోహాల కారణంగా ఈ ప్రాంతం భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పాశమైలారంలో ఓ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం

చర్యలు తీసుకుంటాం

కాలుష్య నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సీఈటీపీ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో ఇది అందుబాటులోకి వస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం. ఏవైనా సమస్యలుంటే 98667 76755, 94415 35050 ఈ నంబర్లలో సంప్రదించాలి.

: గీత, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, సంగారెడ్డి

దెబ్బతింటున్న ఆరోగ్యాలు



రాత్రి పూట కాలుష్యం ఎక్కువగా ఉంటోంది. నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు కాలుష్యం కారణంగా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దాని నియంత్రణ అందరూ కృషి చేయాల్సి ఉంది.

: గడిల శ్రీకాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ, పటాన్‌చెరు

'ఇందిరమ్మ' పేరుతో దోపిడీ

- కాంగ్రెస్ పాలనలో నేతలు డబ్బులు దండుకున్నారు
- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శ

మనూరు(నారాయణఖేడ్): కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పార్టీ నాయకులు ప్రజలను మోసం చేసి డబ్బులు దండుకున్నారని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. తమది పారదర్శక ప్రభుత్వమని అన్నారు. మూనూరు రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని 313 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇవాళ కేసీఆర్ ప్రభుత్వం విడతలవారీగా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఇళ్ల నిర్మాణాలకు సాయం చేస్తోందని వెల్లడించారు. అంతకు ముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు అభివృద్ధి పనులపై తహసీల్దార్ మల్లేశ్‌కుమార్, ఎంపీడీఓ షాజిలోద్దీన్‌తో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాములు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావుపాటిల్, నాగుపాటిల్, నాగేందర్ ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నాగల్‌గిద్దలో..

నాగల్‌గిద్ద మండలపరిధిలోని కిషన్ నాయక్ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రూ.20లక్షలతో పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 60 తండాలను పంచాయతీలుగా మార్చామని గుర్తుచేశారు. 95 శాతం మేర ప్రతి తండాకు రోడ్డు సౌకర్యం కల్పించామని స్పష్టం చేశారు. వాటి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని చెప్పారు. ఎంపీపీ రాథోడ్ మోతీబాయి, జెడ్పీటీసీ సభ్యుడు రాథోడ్ రాజు, వైస్ ఎంపీపీ పండరియాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పండరి పాల్గొన్నారు.

త్వరలో సొసైటీలకు స్థలాల కేటాయింపు

పటాన్‌చెరు: రాష్ట్రంలోని ఎరుకల కులస్తుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ఎరుకల సంక్షేమ సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని ఈ కులస్తుల సంక్షేమానికి సీఎం రూ. 60 కోట్లను కేటాయించారని చెప్పారు. నియోజకవర్గంలోని ఎనిమిది సొసైటీలకు పందుల పెంపకం కోసం త్వరలోనే స్థలాలు కేటాయిస్తామని భరోసానిచ్చారు. అలాగే బీరంగూడ గుట్టపై 1000 గజాలు కేటాయిస్తామని, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ అర్హులైన వారికి తొలి ప్రాధాన్యం అందిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను శాసనమండలికి ముఖ్యమంత్రి ప్రతిపాదించారని, గవర్నర్ తిరస్కరించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ఆందోళన

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్లు కోరారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. వారికి బీఎస్పీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో ఇప్పటికీ కుటుంబపోషణ కష్టతరంగానే ఉందన్నారు. ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం తహసీల్దార్ రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సిద్దురావణ్, రాహుల్, గోపాల్‌రెడ్డి, బాబూరావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయికులు

న్యూస్‌రీల్

గణపతికి 108 రకాల నైవేద్యం



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): వినాయకుడికి 108 రకాల నైవేద్యాలను భక్తులు బుధవారం సమర్పించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం అందుకు వేదికైంది. వివేకానంద యూత్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు నవీన్, శివ, మహేశ్, రాజు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నర్సింలు



నర్సింహులు

జహీరాబాద్ టౌన్: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనింటి నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్, ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, సంజీవ్, గోపాల్‌రెడ్డి, శోభారాణి, శివరాజ్, సహాయ కార్యదర్శులుగా అంజద్, బిస్మిల్లా, సుభాశ్, మల్లయ్యస్వామి, మచ్చేందర్, సభ్యులుగా సురేశ్, షాదుల్లా, రాజు, చౌహన్‌రెడ్డి, మాణిక్, నారాయణ ఎన్నికయ్యారు.

నేడు 3కే రన్

సంగారెడ్డి మున్సిపాలిటీ : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గురువారం 3కే రన్ నిర్వహిస్తున్నట్లు హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ ప్రతినిధులు తెలిపారు. ఈ రన్ ఐబీ నుంచి దొడ్డి కొమురయ్య విగ్రహం వరకు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్‌లూమ్ చైర్మన్ చింతా ప్రభాకర్, సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. శుక్రవారం మెగా కార్డియాక్ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని, కార్డియాలజిస్ట్ అనిల్ వైద్యసేవలను అందించనున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, రోగులకు ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తారని, ఆపై మందులను ఉచితంగా అందజేస్తామని పేర్కొంది.

నేటి నుంచి సిటీ పోలీస్‌యాక్ట్

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సీపీ సూచించారు. సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా అప్పటివరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

నిధులు వేగిరం.. పనులు ముమ్మరం

- కొత్త ప్రతిపాదనలకు ఆమోదం
- పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంతా సందడి
- గజ్వేల్‌లో సీఎం పర్యటించే అవకాశం

గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పెండింగ్ పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అలాగే అత్యవసరమైన కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం త్వరలో పర్యటించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాది ప్రత్యేక స్థానం. సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట నుంచి ప్రాతినిథ్యం వహించడమే ఇందుకు కారణం. జిల్లాలో ఒక్కసారిగా హడావిడి వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ చొరవ ఫలితంగా భారీగా అభివృద్ధి పనులు సాగాయి. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే కొన్ని పనులు పూర్తి కావస్తుండగా.. మరి కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. రూ.27.35కోట్ల వ్యయంతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో తూప్రాన్ రోడ్డువైపు రూ.10కోట్ల వ్యయంతో నిర్మించిన అధునాతన బస్టాండ్‌ను సైతం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. రూ.240కోట్లతో చేపట్టిన రింగు రోడ్డు పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. ఈ మూడు భారీ అభివృద్ధి ప్రాజెక్టులను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి, ఇక్కడ భారీ సభను నిర్వహించడం ద్వారా ఎన్నికల శంఖారావం పూరించడానికి ముందుకుసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం తరహాలో సాగనుందని చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లకు అదనపు నిధులు, నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న భవనాలకు సైతం నిధులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఇక్కడి మున్సిపల్ పాలకవర్గం మంత్రి హరీశ్‌రావుకు ఇప్పటికే వినతి పత్రాన్ని అందజేసింది. గజ్వేల్‌తోపాటు సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయడం, అత్యవసరమైన కొత్త పనులకు ఆమోదం పలికే అంశంపై మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటుగా బీసీ బంధు, మైనార్టీలకు ఆర్థికసాయం, గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ల పంపిణీపైనా దృష్టి సారించారు. వివాదాల కారణంగా కొన్ని చోట్ల దళిత బంధు అమలుకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. అందరి ఆమోదంతో దళిత బంధును అమలు చేయడానికి నిర్ణయించారు. మొత్తానికి జిల్లాలో కొన్ని రోజులుగా సందడి వాతావరణం స్పష్టంగా కనిపిస్తున్నది. జిల్లాలో సీఎం పర్యటన తర్వాత ఇక ఎన్నికల వేడి పెరగనుందని తెలుస్తోంది.



గజ్వేల్‌లో అధునాతన హంగులతో నిర్మించిన బస్టాండ్

శాకంబరేశ్వరుడిగా గణనాథుడు

పటాన్‌చెరు టౌన్: శాకంబరేశ్వరుడిగా గణనాథుడు దర్శనమిచ్చాడు. మండల పరిధిలోని రుద్రారం గణేశ్ గడ్డ దేవాలయంలో కొలువై ఉన్న గణేశుడిని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం కూరగాయలతో అలంకరించారు. ఆపై అర్చకులు ప్రత్యేక పూజలను చేశారు. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ఆవరణలో నిత్య అన్నదానం కొనసాగుతోందని ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు.



శాకంబరేశ్వరుడి అలంకరణలో స్వామివారు

పర్యాటక రంగాభివృద్ధిపై పాటలు

సంగారెడ్డి టౌన్ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో బుధవారం కల్పగూరులోని మంజీరా ప్రాజెక్టు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధిపై పాటలను కళాకారులు పాడారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ అధికారి సతీశ్, జిల్లా యువజన క్రీడల అధికారి రాంచందర్ రావు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కల్పగూరులో కలెక్టర్ శరత్ తదితరులు

ఓవరాల్ చాంప్ సంగారెడ్డి, అల్గోల్

- ముగిసిన రెండో జిల్లాస్థాయి క్రీడాపోటీలు

జహీరాబాద్ టౌన్: బాలుర అండర్ -17 విభాగంలో ఓవరాల్ చాంప్‌గా సంగారెడ్డి కంది మైనార్టీ గురుకుల విద్యార్థులు, అండర్-14 విభాగంలో అల్గోల్ మైనార్టీ గురుకుల విద్యార్థులు నిలిచారు. జహీరాబాద్ మండలంలోని అల్గోల్ తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సెకండ్ డిస్ట్రిక్ట్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్(జోష్)- 2023 బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాణిక్‌రావు హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గురుకులాల ద్వారా పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ వారు రాణించాలని సూచించారు. కాగా, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ 10 విభాగాల పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్. జమీల్, పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, డిప్యూటీ వార్డెన్ సమయుద్దీన్, వైద్యులు డాక్టర్ డి.ప్రవీణ, ఉషశ్రీ, పీటీ ఖాజాపాష, అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌టౌన్ : విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఖోఖోలో కల్హేర్, అందోల్ జట్ల ప్రతిభ

వట్‌పల్లి(అందోల్): బాలికల అండర్-14 ఖోఖో విభాగంలో కల్హేర్, వట్‌పల్లి వరుసగా మొదటి, రెండో స్థానాలను కైవసం చేసుకున్నాయి. అలాగే అండర్17 విభాగంలో అందోల్ విజేతగా నిలవగా, రాంచంద్రాపూర్ రన్నరప్‌గా నిలిచింది. జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) సంగారెడ్డి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు బుధవారంతో ముగిశాయి. అలాగే బాలుర అండర్ -14 ఖోఖో విభాగంలో చౌటకూర్, పుల్కల్ క్రీడాకారులు వరుసగా ఫస్ట్, సెకండ్ ప్లేస్‌లు దక్కించుకున్నారు. అండర్-17 ఖోఖో విభాగంలో హత్నూరు తొలిస్థానం, పుల్కల్ రెండోస్థానం పొందింది.

క్లుప్తంగా

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్‌పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది సంగారెడ్డి, వీరప్ప, రవిలతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. గ్రామానికి చెందిన ఆరుగురు పేకాట ఆడుతుండగా పట్టుకుని రూ.30,200ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం జహీరాబాద్ కోర్టుకు తరలించామన్నారు.

వైన్స్‌లో మద్యం బాటిళ్ల చోరీ



వైన్స్‌లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని కాళ్ళకల్ -2 వైన్స్‌లో చోరీ జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైన్స్ షట్టర్‌కు నిర్వాహకులు ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లారు. బుధవారం వచ్చి చూసేసరికి షట్టర్ సగం తెరిచి ఉంది. దీంతో వైన్స్ యజమాని సార సంతోష్‌గౌడ్ మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. వైన్స్‌లో మద్యం బాటిళ్లు మాయమైనట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి



అమృత్ కలశ యాత్రలో ఉన్నత పాఠశాల విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అమృత్ కలశయాత్ర నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రాజేశ్వర్, వెంకటేష్, రఘుపతి, రాథోడ్, రాధ, సరస్వతి విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మకర్తకు సన్మానం



గణపతి మంటపంలో ధర్మకర్త పూజలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్, చిట్టోజిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కిషన్‌రావ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక విగ్రహాల దాత కిషన్‌రావును బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

శిశువు మృతదేహం లభ్యం



రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని సంగీత థియేటర్ సమీపంలోని కల్వర్టు వద్ద ఓ శిశువు మృతదేహం లభ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాలు. ఈ నెల 25 తేది సాయంత్రం పట్టణంలోని సంగీత థియేటర్ సమీపంలో కల్వర్టు వద్ద ఓ శిశువు మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. ఆడ శిశువు కావడంతో కల్వర్టు వద్ద పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పడేసి కూడా మూడు రోజులై ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ సవారీ

- సైక్లింగ్‌కు మొగ్గు చూపుతున్న యువత
- హెల్త్ క్లబ్‌ల ద్వారా సైకిళ్లు పంపిణీ
- ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం

ఒకప్పుడు ప్రతి ఇంటిలో సైకిల్ ఉండేది. ఎక్కడికి వెళ్లాలన్నా దాని మీదే వెళ్లేవారు. ఆధునిక బైకులు, కార్ల రాకతో సైకిళ్ల వాడకం తగ్గిపోయింది. ఎవరైనా సైకిల్ తొక్కుతూ రోడ్డు మీద కనిపిస్తే ఎగతాళి చేసేవారు. అలాంటిది ఆరోగ్య ప్రయోజనం కోసం యువత మళ్లీ సైకిల్‌పై సవారీ చేస్తున్నారు.



సైకిళ్లతో తెల్లాపూర్ స్ఫూర్తి హెల్త్ క్లబ్ సభ్యులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నేటి యువత ఒత్తిడికి దూరంగా ఉండేందుకు అనేక మార్గాలను వెతుక్కుంటున్నారు. నిత్యం పని ఒత్తిడి, పోటీ ప్రపంచంలో ఉదయం నుంచి రాత్రి వరకు మనిషి యాంత్రిక జీవితాన్ని గడుపుతున్నాడు. దాంతో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కొంతమంది జిమ్‌లకు వెళ్తుండగా, మరి కొందరు సైకిల్ తొక్కడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో అనేక సైకిల్ క్లబ్‌లను ఏర్పాటు చేసి సైకిల్ తొక్కేవారిని ప్రోత్సహిస్తున్నారు. ఆరోగ్యం కోసం చిన్నారుల నుంచి వృద్ధుల వరకు సైక్లింగ్ పై ఆసక్తిని పెంచుకుంటున్నారు. పూర్వకాలంలో లాగా సమయం దొరికిందంటే సైకిల్ తొక్కుతున్నారు.

బీహెచ్ఈఎల్ కాలనీలో విశాలమైన రోడ్లు, మంచి వాతావరణం ఉండడంతో ఉదయం సాయంత్రం వేళల్లో ఐటీ ఉద్యోగులు, యువత సైకిల్ పై చక్కర్లు కొడుతున్నారు. అదేవిధంగా గతంలో హైదరాబాద్ నగరానికి చెందిన సైక్లింగ్ క్లబ్బులు సైతం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి సైకిళ్ల కోసం ప్రత్యేక ట్రాకులను అభివృద్ధి చేయాలని కోరారు. దాంతో ప్రభుత్వం స్పందించి కోట్లాది రూపాయలు వెచ్చించి రింగ్ రోడ్డు ఆనుకొని ఓ సైక్లింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేసింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డు నుంచి కోకాపేట్ వరకు సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది త్వరలో అందుబాటులోకి రానుంది. కాగా నేడు మార్కెట్లో సైతం వివిధ రకాల సైకిళ్లు అందుబాటులోకి వచ్చాయి. కొందరు విదేశాల నుంచి సైతం సైకిళ్లను తెప్పించుకుంటున్నారు. అయితే సైక్లింగ్‌తో ఆరోగ్యం పొందాలనుకునేవారు నిత్యం సుమారు 10 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్లు సైకిళ్ల తొక్కుతున్నారు.

ప్రోత్సహిస్తున్న సైక్లింగ్ క్లబ్‌లు

ఆరోగ్యమే మహాభాగ్యమంటూ పలు సైక్లింగ్ క్లబ్‌లు యువతను ప్రోత్సహిస్తుంది. సైకిల్ తొక్కడంపై ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నాయి. గతంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్ఫూర్తి హెల్త్ క్లబ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సైక్లింగ్ పై అవగాహన కల్పించి సుమారు 200 మంది సభ్యులకు సైకిళ్లు పంపిణీ చేశారు. వీరంతా నిత్యం 15 కిలోమీటర్లు సైకిల్ తొక్కేవారు. అదే సమయంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి సైతం అనేకమందికి సైకిల్ ఇప్పించి ప్రోత్సహించారు.



కొల్లూరులో రింగ్ రోడ్డును ఆనుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్

సైక్లింగ్ నా ప్రాణం



నాకు సైక్లింగ్ అంటే ప్రాణం. నిత్యం 40కిలోమీటర్లు సైకిల్ తొక్కుతా. గతంలో పారిస్ నుంచి బ్రెస్ట్ వరకు 1200 కిలోమీటర్లు 90 గంటల్లో సైక్లింగ్ పూర్తి చేశా. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంతో పాటు రోజంతా చురుగ్గా ఉంటాం.

– ప్రశాంత్, ఐటీ ఉద్యోగి

ఆరోగ్యంగా ఉంటాం



సైక్లింగ్ చేయడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటాం. దానిని దృష్టిలో పెట్టుకొని రోజు ఎంత బిజీగా ఉన్నా ఉదయం, సాయంత్రం సమయంలో తప్పనిసరిగా 20 కిలోమీటర్లు సైకిల్ ప్రయాణం చేస్తా.

– అరవ రామకృష్ణ, వ్యాపారవేత్త

సైకిల్‌పైనే వెళ్తుంటా



నా వయసు 83 సంవత్సరాలు. ఇప్పటికీ రోజూ ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్ మీదనే పోతుంట. రోజు సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యంగా ఉంటాం. చిన్నప్పటి నుంచి నాకు సైకిల్ తొక్కడం అంటే ఇష్టం.

–నాగేశ్వరరావు, తెల్లాపూర్

ట్రాక్‌లను అభివృద్ధి చేయాలి



2016లో స్ఫూర్తి హెల్త్ క్లబ్‌ను ఏర్పాటు చేసి సైక్లింగ్‌పై అవగాహన కల్పించాం. రింగ్ రోడ్డు పక్కన సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. మిగతా చోట్ల కూడా అభివృద్ధి చేయాలి.

– చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, స్ఫూర్తి హెల్త్ క్లబ్ వ్యవస్థాపకులు

పట్టపగలే ఇంట్లో చోరీ

పాపన్నపేట(మెదక్): కుర్తివాడ గ్రామంలో దొంగలు చెలరేగిపోతున్నారు. ఇటీవల ఓ మహిళ మెడలో నుండి పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన సంఘటన మరువక ముందే బుధవారం పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడి ఆభరణాలు చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. ఇలా ఉన్నాయి. కుర్తివాడకు చెందిన పట్లోల్ల నాగరాజు డ్యూటీకి వెళ్లగా, ఆయన భార్య వసంత ఇంటికి గొళ్లెం పెట్టి.. పక్కింట్లో జరుగుతున్న విందుకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి లోపల నుంచి గడియ పెట్టుకున్నారు. విందు ముగించుకొని వసంత ఇంటికి రాగా, తలుపు లోపలి నుంచి గడియ పెట్టినట్లు గుర్తించి చుట్టుపక్కల వారిని పిలిచింది. లోపల ఉన్న వారు ఒక్కసారిగా బయటకు వచ్చి బైక్‌పై ఉడాయించారు. వసంత ఇంట్లోకి వెళ్లి చూసే సరికి 4 తులాల బంగారు గొలుసు, మాటీలు చోరీకి గురైనట్లు గుర్తించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

తూము మరమ్మతు చేసేందుకు వెళ్లి..

నీటమునిగి వీఆర్ఏ మృతి



నర్సింలు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): చెరువు నీటిలో మునిగి వీఆర్ఏ మృతి చెందిన సంఘటన మెదక్ మండలం మక్తభూపతిపూర గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వీఆర్ఏ ముష్టి నర్సింలు(60) బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఊర చెరువులో నీరు వృథాగా పోతుందని తెలిసి తూము మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. నర్సింలు బట్టలు, చెప్పులు కట్టపై ఉన్న విషయాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. తూములో వెతకగా శవం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని హైదరాబాద్ జోన్ (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల)ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ అన్నారు. సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపోలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 46మంది సిబ్బందికి సిద్దిపేట డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రగతి చక్రం అవార్డులు ప్రదానం చేసి, ప్రశంసాపత్రాలతో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం నాయక్ మాట్లాడారు. డిపోలోని ప్రతి ఒక్క ఉద్యోగి ఉత్తమ ఉద్యోగి కావాలని, అందరూ అవార్డులు తీసుకోవాలన్నారు. సిద్దిపేట నుంచి తిరుపతి, షోలాపూర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నారన్నారు. సిద్దిపేట డిపోకు ప్రతి సంవత్సరం రూ.20కోట్ల ఆదాయం వచ్చే వనరులు ఉన్నాయన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. తార్నాకలోని ఆస్పత్రిలో కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు. హెల్త్ చాలెంజ్‌లో 5వేల మంది ఉద్యోగులను ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని రిఫరల్ చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సిబ్బందికి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.6కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ఈ మేరకు సిద్దిపేట డిపో నుంచి రూ.8కోట్ల ఆదాయం వచ్చేలా పనిచేస్తామని సిబ్బంది హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, డీఆర్ఎంలు జోత్స్న, దైవాదీనం, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, మౌలానా, అస్లామ్, రవిందర్, నాయిని నారాయణరెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పథకాలు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్ : మహిళల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో జరిగిన స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 1470 మంది యువతీ యువకులకు సొంత ఖర్చులతో డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. అలాగే మైనార్టీలకు ప్రభుత్వం మంజూరి చేసిన లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కార్యాలయ భవన నిర్మాణ పనులను ఎంపీ పరిశీలించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఖలీల్ తదితరులు ఉన్నారు.

పొగమంచులో దారి కనిపించక..

కారు, బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



ధ్వంసమైన కారు, బైక్

చిన్నశంకరంపేట(మెదక్): దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో దారి కనిపించక ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్న సంఘటన చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం రోడ్డుపై దట్టంగా మంచు పరుచుకోవడంతో మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అంబాజీపేట గ్రామానికి చెందిన చాకలి మధుకు తీవ్రగాయాలు అయ్యాయి. అతన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ంలో కారు ముందు భాగం సుజ్జయింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను రోడ్డుపై నుంచి పక్కకు జరిపించారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్య

అప్పుల బాధతో....



భాస్కర్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన భాస్కర్(36) ఆటో నడుపుతుంటాడు. ఆటో కొనుగోలుకు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. అవి తీర్చడానికి ఆటో అమ్మి ఓ పరిశ్రమలో పనికి కుదిరాడు. అయినా అప్పులు తీరలేదు. దీంతో మనోవేదనకు గురై ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాధిక, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ సంఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో..



యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఆరోగ్య సమస్యతో పాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాలు. మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన గంట యాదగిరి(56) మూడేళ్ల క్రితం అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందడంతో రూ.5 లక్షలు ఖర్చు అయింది. ఆర్థిక భారం, అనారోగ్యంతో బాధపడుతూ మానసిక వేదనకు గురైన యాదగిరి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన శేరి కుమార్ (28)కు అల్వాల గ్రామానికి చెందిన పావనితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. కుమార్ వ్యవసాయం చేస్తుంటాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన కుమార్ అల్వాల గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పురుగు మందు తాగి..



కరుణాకర్ (ఫైల్)

పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అల్వాలలో జరిగింది. మిరుదొడ్డి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొమ్మ లింగం, లక్ష్మిల కుమారుడు కరుణాకర్ (30) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కలత చెందిన కరుణాకర్ బుధవారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఉరివేసుకుని..



హరీశ్‌శర్మ (ఫైల్)

తూప్రాన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తావోజీ హరీశ్‌శర్మ(38) భార్య రేణుక ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హరీశ్‌శర్మ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రాగి పెంటయ్య (ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రాయిలాపూర్ గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాగి పెంటయ్య(42) వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. బుధవారం సాయంత్రం టీవీఎస్ మోపెడ్‌పై వెంకట్రావ్‌పేటగేట్ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా రాయిలాపూర్‌గేట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ విఠల్ తెలిపారు. మృతునికి భార్య మనోహర, కూతురు నందిని ఉన్నారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో..



రవి(ఫైల్)

రామాయంపేట(మెదక్): బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మండలంలోని తొనిగండ్ల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొనిగండ్ల గ్రామానికి చెందిన దీసు రవి(31) తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై హవేళిఘనపూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో జరిగిన బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి భూషణం ఆరోగ్యం విషమంగా ఉండడంతో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి..



నారాయణ మృతదేహం

చేగుంట(తూప్రాన్): చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన గుంబోయిన నారాయణ(61) స్థానిక చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువులు అతని కోసం వెతికారు. చెరువు గట్టుపై నారాయణ బట్టలు కనిపించాయి. గజ ఈతగాళ్లతో గాలించగా నారాయణ మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు చేపలు పట్టే వల చుట్టుకోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని గజ్వేల్ మున్సిఫ్ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి ప్రియాంక మాట్లాడారు. విజేతలకు గజ్వేల్ ఏసీపీ రమేష్‌తో కలిసి జడ్జి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు, ఎంఈవో సునీత, మెదక్ ఆర్ఎల్‌సీ నర్సింహ, విజిలెన్స్ అధికారులు గౌస్, ప్రభుచరణ్, డిప్యూటీ తహసీల్దార్ భవాని, సుధారాణి, శ్రీవాణి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల వారీగా జాబితాలు

- బ్యాంకు రుణాల రెన్యువల్ వేగవంతం చేయాలి
- ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహించాలి
- అధికారులకు కలెక్టర్ రాజర్షిషా ఆదేశం

మెదక్ కలెక్టరేట్: రుణమాఫీలో లబ్ధి పొందిన రైతుల రుణాలు వెంటనే రెన్యువల్ చేయాలని కలెక్టర్ రాజర్షిషా బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ, బ్యాంకు అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీలో లబ్ధి పొందిన రైతుల రుణాలు వంద శాతం రెన్యువల్ చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. అల్లాదుర్గం మండలానికి సంబంధించిన వివరాలు తెలపడంలో బ్యాంకు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ, బ్యాంకు అధికారులు సమన్వయంతో గ్రామాల వారీగా రుణమాఫీలు లబ్ధి పొందిన రైతుల వివరాలు సేకరించాలని సూచించారు. రైతు వేదికలు సమావేశాలు ఏర్పాటు చేసి రుణాలు రెన్యువల్ చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. బ్యాంకు రుణం తీసుకొని రుణం చెల్లించిన తర్వాత చనిపోయిన వ్యక్తులకు సంబంధించిన డబ్బులు వారి వారసులకు నిబంధన మేరకు అందించాలని చెప్పారు. రైతులను ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కోసం 623 ఎకరాలకు సర్వే అయినట్లు తెలిపారు. సంబంధిత రైతులతో మాట్లాడి డీడీలు కట్టించాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు అవగాహన కోసం గుర్తించిన 150 మంది రైతులకు క్షేత్ర స్థాయి పర్యటన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ , డీహెచ్ఓ నర్సయ్య, సీపీఓ కృష్ణయ్య, ఎల్‌డీఎం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

హవేళిఘణాపూర్(మెదక్): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధ వారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ వైపీఆర్ కళాశాల భవనాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎన్నికల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం కళాశాలను పరిశీలించారు. రాబోయే ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, అందులో భాగంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేయాలన్నారు.



పాటను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా పక్కన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కచ్చితంగా ఓటేద్దాం!

పాటను ఆవిష్కరించిన కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: ఓటర్లను చైతన్యం చేసేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రూపొందించిన మెదక్ జిల్లా స్వీప్‌సాంగ్ 'కచ్చితంగా ఓటేద్దాం' పాటను కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. పాట రచయిత సాయిసిరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీ ఓలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి , వివిధ మండలాల తహశీల్దార్లు శ్రీనివాస్, కమలాద్రి, శ్రీనివాస్ చారి, లక్ష్మన్, ఏవో బలరాం పాల్గొన్నారు.